క్లుప్తంగా

నేడు శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా వెంకటేష్ ఖని గుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీ భూనీల సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం సోమవారం ఉదయం 10 గంటలకు గుట్టమీద ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 10 రోజులు జరగనున్న ఉత్సవాలకు ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రముఖులు, కొత్తగూడెం ఏరియా అధికారులు, కార్మికులు, వారి కుటుంబసభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు. ఈ వేడుకలకు అయ్యే ఖర్చును ఆడపాల వెంకటేశ్వర్లు, త్రిమూర్తి, సత్యనారాయణ కుటుంబ సభ్యులు విరాళంగా ఇవ్వనున్నారు.

జాతర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


సంఘీభావం తెలుపుతున్న ఈసం వంశం నాయకులు

ఇల్లెందు: ఈసం వారి ఇలవేల్పు దూలుగొండ జాతర ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు గుండాల మండలం రోళ్లగడ్డ గ్రామంలో నిర్వహించనున్నట్లు ఈసం వంశ పెద్దలు ప్రకటించారు. ఆదివారం ఇల్లెందు ముషాఫిర్ ఖానాలో జాతర పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈసం నర్సింహారావు మాట్లాడుతూ... ఏటా జాతర వైభవంగా నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. జాతర సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం – వరంగల్ జిల్లాల నుంచి హాజరైన ఈసం వంశ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా బుడియా బాపు జాతర


పూజలు నిర్వహిస్తున్న పాండు సాధు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లా తండాలో శనివారం రాత్రి బానోత్ పాండు సాధు ఆధ్వర్యంలో బుడియా బాపు జాతర ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి బంజారా గిరిజనులు తరలి వచ్చి బుడియా బాపు, శ్రీ ఆంజనేయస్వామిలను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, దుద్దుకూరి మధుసూదన్ రావు, బానోత్ నవీన్ రాథోడ్, నర్వనేని పుల్లారావు, వేల్పుల నరసింహారావు, భూక్యా అమ్రు, నిమ్మటూరి కనకయ్య, మాలోత్ నరసింహారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మహిళలు

టేకులపల్లి: మండల కేంద్రంలోని కుప్పుస్వామి కాలనీలో లలితా దేవి గ్రూప్ మహిళల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆటపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పలువురు మహిళలను శాలువాలతో సన్మానించారు. అనంతరం మహిళలు ఆటపాటలతో సందడి చేశారు.

ఎస్పీ కార్యాలయంలో..

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో అదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎస్పీ రోహిత్‌రాజు సతీమణి మౌనిక కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలను తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ.. నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. అందరితో కలిసి ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

టేకులపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ పోగుల సురేష్ తెలిపిన వివరాలు... ఆదివారం టేకులపల్లి సెంటర్‌లో ఎస్‌ఐ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపడుతుండగా శంభునిగూడెం నుంచి ఇసుక లోడుతో వస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్లను స్టేషన్‌కి తరలించి అనిశెట్టిపల్లికి చెందిన వెలిసాల రణదీప్, మద్దిరాలతండాకు చెందిన మాలోతు రవీందర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శ్రీహరి గుట్టపైకి రోప్‌వే..

- నిత్యం భక్తుల రాకపోకలతో విరాజిల్లుతున్న శ్రీనివాసగిరి గుట్ట
- గతంలో గుట్టపైకి రూ.11కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు
- అటవీ శాఖ అనుమతులు రాక వెనక్కి మళ్లిన వైనం


రోప్‌వే నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

పాల్వంచ: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతోంది పాల్వంచలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం. ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులు నిత్యం గుట్టకు వస్తుంటారు. అయితే గుట్టపైకి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేక భక్తులకు స్వామి దర్శన భాగ్యం కలగడం లేదు. భక్తుల సౌకర్యార్థం రోడ్డు నిర్మాణానికి 2023లో రూ.11కోట్ల నిధులు మంజూరయ్యాయి. రెండు కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే గుట్ట రోడ్డు అటవీ శాఖ పరిధిలో ఉంది. అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో ఆ నిధులు వెనక్కి మళ్లిపోయాయి. దీంతో భక్తుల, ఆలయ భక్త సమాజ మండలి ఆధ్వర్యంలో రోప్‌వే నిర్మిస్తున్నారు.

ఆలయ విశిష్టత..

పాల్వంచలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ఎంతో విశిష్ట ఉంది. ఎత్తయిన కొండపై ఉన్న ఈ ఆలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. కొండపై ఆదిశేషుని పడగల రూపంలో ఏర్పడిన ఏకశిలా బిలంలో స్వామి భక్తులను అనుగ్రహిస్తున్నట్లు ఉంటుంది. 1500 మెట్లపై నడిచి వెళ్తే 600 అడుగుల ఎత్తులో ఉన్న గుహలో స్వామి వారు వేంచేసి ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఏటా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తుంటారు. శ్రీనివాస గిరి అభివృద్ధికి 2017లో ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో గుట్టరాళ్లను చెక్కి మెట్లుగా మలిచారు. కాగా మరో వైపు రోడ్డు మార్గం ద్వారా ఆలయానికి వెళ్లేందుకు సగం వరకే రోడ్డు మార్గం ఉండగా మిగతా రోడ్డు వెడల్పు, గుట్టపై వరకు సీసీ రోడ్డు ప్రతిపాదనలు చేశారు.

వెనక్కి మళ్లిన నిధులు..

గుట్టపైకి వెళ్లేందుకు రోడ్డు మార్గం అవసరమని గుర్తించిన అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర రావు ప్రత్యేక కృషి చేశారు. ఈ క్రమంలోనే ఫారెస్ట్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు సంయుక్తంగా గత ఏడాది గుట్టపైకి రెండు కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానికి సర్వే చేశారు. రోడ్డు నిర్మాణం కోసం రూ.11కోట్ల నిధులు అవసరమని లెక్కలేశారు. అటవీ శాఖ అనుమతులు ఇస్తే ఇక్కడి ఐదు ఎకరాల స్థలానికి రెవెన్యూ శాఖ మరోచోట ఐదెకరాల స్థలం ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. అయినా అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు సైతం రోడ్డుకు టెండర్లను పిలవలేదు. ఈ క్రమంలో మంజూరైన నిధులు వెనక్కి మళ్లాయి. కాగా ప్రస్తుతం ప్రభుత్వం సైతం మారడం, కొత్త ప్రజాప్రతినిధులు రావడంతో రోడ్డు మార్గం సమస్య మళ్లీ మొదటికొచ్చింది.


గుట్టపై శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం

స్పందించిన భక్త సమాజ మండలి...

గుట్టపై కల్యాణ మహోత్సవాలు జరపడం భక్త సమాజ మండలికి ప్రతీఏటా సవాల్‌గా మారింది. కల్యాణానికి అవసరమైన సామాగ్రి, భక్తులకు సదుపాయలు కల్పించడం కష్టతరంగా మారింది. ప్రతీఏటా కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తుల పెద్దెత్తున వస్తుంటారు. మార్చి 25న కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ క్రమంలో సామగ్రిని తరలించేందుకు భక్త సమాజ మండలి రూ.10లక్షల ఖర్చుతో గుట్టపైకి రోప్‌వే నిర్మాణ పనులు చేపట్టారు. శరవేగంగా పనులు జరుగుతున్నాయి.

రూ.10లక్షలతో రోప్‌వే పనులు..



రోడ్డు మార్గం వేస్తే భక్తుల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది. కానీ అనుమతులు రాకపోవడంతో మంజూరైన నిధులు వెనక్కి మళ్లాయి. ఈ క్రమంలో ఈ ఏడాది కల్యాణ మహోత్సవానికి ఇబ్బంది లేకుండా రూ.10లక్షల వ్యయంతో రోప్‌వే వేస్తున్నాం. కొంత వరకు ఇబ్బందులు తొలగిపోతాయి.

– లక్ష్మణాచార్యులు, భక్త సమాజ మండలి అధ్యక్షుడు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి..



గతంలో గుట్టపైకి వెళ్లేందుకు రూ.11కోట్ల నిధులు మంజూరు కాగా, ఆ పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం మళ్లీ వేంకటేశ్వర స్వామి ఆలయ విశిష్టతను, భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని చొరవ తీసుకోవాలి. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే కూనంనేని దృష్టికి తీసుకెళ్లాం.

– రాము, భక్త సమాజ మండలి ప్రధాన కార్యదర్శి

నిధులు వెనక్కి వెళ్లాయి..

సీసీ రోడ్డు మార్గం కోసం గతంలో సర్వే చేసి రూ.11 కోట్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. నిధులు కూడా మంజూరు అయ్యాయి, కానీ అటవీశాఖ నుంచి రావాల్సిన అనుమతులు రాలేదు. ఈ క్రమంలో సమయం అయిపోవడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో ఆ అంశం మరుగున పడింది. భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

– నాగేశ్వరరావు, డీఈ, ఆర్‌అండ్‌బీ

బొగ్గువేలంలో పాల్గొని సింగరేణిని రక్షించండి..


ఉప ముఖ్యమంత్రి భట్టికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు వేలంలో పాల్గొనండి.. సింగరేణిని రక్షించండి.. అని తెలంగాణ రాష్ట్ర ఇంధనశాఖ, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో భట్టిని కలిశారు. మాట్లాడుతూ.. సింగరేణి, కార్మికుల స్థితిగతుల గురించి వివరించారు. సింగరేణికి కొత్తగనులు రాకపోతే పరిస్థితి ఆందోళనకరంగా ఉంటుందన్నారు.

అదేవిధంగా నైనీలో 3,800 సూపర్ పవర్ ప్రాజెక్ట్ నిర్మించాలని, ప్రధానంగా కేంద్రం నిర్వహించే బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనాలని లేదంటే సింగరేణికి చాలా నష్టం జరుగుతుదన్నారు. గత ప్రభుత్వాలు బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవటం వలన సంస్థకు అతి ముఖ్యమైన కోయగూడెం, సత్తుపల్లి ప్రైవేట్ సంస్థలకు పోయాయన్నారు. అదే విధంగా సింగరేణికి పుట్టినిల్లులాంటి ఇల్లెందులో గనులు మూతపడి గత వైభవం కోల్పోతోందని, ఇలాంటి సమయంలో కోయగూడెం బొగ్గుబ్లాకు గత ప్రభుత్వం చేతకాని తనం కారణంగా ప్రైవేట్ కంపెనీ దక్కించుకుందన్నారు. ఒకవేళ సింగరేణికి కోయగూడెం వచ్చి ఉంటే ఏడాదికి 3 మిలియన్ టన్నులతో 20 ఏళ్ల బొగ్గు ఉత్పత్తి వచ్చేదని తెలిపారు. అదేవిదంగా ఆపారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్న సత్తుపల్లి కూడా వేలంలో దక్కించుకునే అవకాశం రెండుసార్లు వచ్చినా గత ప్రభుత్వ తప్పుడు విధానాల వలన సింగరేణికి నష్టం జరిగిందన్నారు. సానుకూలంగా స్పందించిన భట్టి సింగరేణిని అన్నిరంగాలలో అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తామని త్వరలో కార్మిక సంఘాలతో ఒక సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామ పంచాయతీల పరిధిలో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య శంకుస్థాపన చేయనున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ రాజు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా 61 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. బొజ్జాయిగూడెం, ఇందిరానగర్, రాఘబోయినగూడెం, సత్యనారాయణపురం, మామిడిగుండాల, చల్లసముద్రం, ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

సంస్మరణ సభకు తరలిరావాలి


అభివాదం చేస్తున్న నాయకులు

ఇల్లెందు: ఇంద్రవెల్లి అమర వీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ సంఘం నేతలు ముక్తి రాజు, కొడెం వెంకటేశ్వర్లు, తాటి మధు కోరారు. ఆదివారం ఇల్లెందులోని పెన్షనర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, విద్య, ఉద్యోగ, భూసంబంధ హక్కులు అమలు కావాలంటే లంబాడీలను తొలగించాల్సిందేనన్నారు. జల్, జమీన్, జంగల్ నినాదంతో పోరాడాలని, అడవి మీద సర్వ హక్కులూ ఆదివాసీలకు ఉండాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పొడెం రామ్మూర్తి, తాటి రామారావు, బొర్రా స్వామి, పొడుగు వెంకటేశ్వర్లు, ఈసాల వెంకటేశ్వర్లు, పుల్సం భద్రం, ముక్తి కోటేశ్వరరావు, గుమ్మడి రామ్‌కుమార్, తోలెం వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లమ్మకు నివాళి..


పుల్లమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

టేకులపల్లి: కోయగూడెం గ్రామానికి చెందిన దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్మన్ పూనెం రామచంద్రయ్య సతీమణి పూనెం పుల్లమ్మ (80) గత నెల 27న మృతి చెందారు. ఈ మేరకు ఆదివారం స్వగ్రామంలో దశ దినకర్మ నిర్వహించారు. పుల్లమ్మ భర్త రామచంద్రయ్య 1978లో బూర్గంపాడు ఎమ్మెల్యేగా, 1982లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జెడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత పూనెం సురేందర్, ఉమా, బండ్ల రజిని, చీమల సత్యనారాయణ, వరప్రసాద్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పుల్లమ్మకు నివాళులర్పించారు. మాడె సక్కుబాయి, శిరోమణి, శకుంతల, కన్నారావు, సీత, పూనెం సుధీర్, కళావతి, పూనెం ముక్తేశ్వర్‌రావు, రజిత, ప్రకాశ్, అరుణ్,బంటి, అప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రవన్నకు నివాళి


ఇల్లెందు: సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) 9వ వర్ధంతి సభను మాస్‌లైన్ (ప్రజాపంథా) కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. నేతలు రవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుర్ర వెంకన్న, కాంపాటి పృథ్వీ, అజ్మీర బిచ్చా, సుందర్, సావిత్రి, శ్రీరాం కోటయ్య, గాంధీ, బుర్ర రాఘవులు, దేవా, లక్ష్మయ్య, వాంకుడోతు శంకర్, శాంతారావు, బాలు, ముత్తక్క పాల్గొన్నారు.

సత్యదేవికి..

జూలూరుపాడు: వెంగన్నపాలెం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు నల్లగట్ల దిలీప్‌కుమార్ తల్లి సత్యదేవి ఇటీవల మృతి చెందారు. ఆదివారం సత్యదేవి దశదిన కర్మ కార్యక్రమానికి పలు పార్టీల నాయకులు, జర్నలిస్టులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో జడ్జి కాళ్లూరు ప్రభాకర్ రావు, నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, కాళ్లూరు వెంకటేశ్వరరావు, మాలోత్ మంగీలాల్ నాయక్, బానోత్ నవీన్ రాథోడ్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, రోకటి సురేష్, రాంశెట్టి రాంబాబు, కొమ్మినేని పాండురంగారావు, యల్లంకి సత్యనారాయణ, కొమ్మినేని కృష్ణమూర్తి, చాపలమడుగు రామ్మూర్తి, జర్నలిస్టులు వురిమెళ్ల పూర్ణచందర్‌రావు, మోదుగు ప్రభాకర్, ఎస్కే సిద్ధిక్, మోదుగు ఆదాం, కొడెం సీతాకుమారి, కుడురుపాక నిర్మల, బాపట్ల వెంకటేశ్వరరావు, బుడిపూడి ప్రభాకర్, ఇల్లంగి తిరుపతి తదితరులు ఉన్నారు.

పరీక్షలకు ఓఎంఆర్‌లను వినియోగించాలి

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల్లో సోమవారం నిర్వహించే ఇంగ్లిష్ పరీక్షకు మరుసటి రోజు నిర్వహించే గణితం పరీక్షలకు ఓఎంఆర్‌లను ఉపయోగించాలని కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి ప్రభుదయాళ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి ఓఎంఆర్‌ల గురించి పదో తరగతి విద్యార్థులకు ముందే అవగాహన కల్పించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో అవగాహన కల్పించాలని కోరారు. మండలంలో పదో తరగతి వార్షిక పరీక్ష సెంటర్ల నిర్వాహకులు సెంటర్లను పరిశీలించిన సౌకర్యాల వివరాలు తెలియజేయాలన్నారు.

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం..


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కోలాటం ఆడుతున్న మహిళలు

టేకులపల్లి: గంగారం పంచాయతీ సంపత్‌నగర్‌లోని కొండపై వెలసిన గిరిజన బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం 12.39 గంటల సుముహూర్తమున స్వామి వారికి ఉభయ నాంచారులైన అలివేలుమంగ, పద్మావతిలతో వైభవోపేతంగా కళ్యాణం చేశారు. టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి, ఇల్లెందు మండలాలతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చి కల్యాణ వేడుకలను తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు కొండపల్లి రాజగోపాలకిషన్, రజిత, అనువంశిక పారంపర్య ధర్మకర్తలు అజయ్‌కుమార్, సునాలిని, పవన్‌రావు, మంగతాయారు దంపతులు, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసులు, యాజ్ఞికులు శ్రీరంగం అజయ్ సాయి చక్రి చార్యులు, శ్రీరంగం విజయ్ సాయి చక్రి చార్యులు, ఆలయ అర్చకులు రమేష్ ఆచార్యులు, అక్కినపల్లి సోమాచార్యులు, ఇస్లావత్ బాలు, చారి,లాకావత్ రమేష్, సునీత, హత్తీరామ్, శంభు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. ఎస్‌ఆర్‌ఐ కొండపల్లి విఘ్నేష్, ఆళ్లపల్లికి చెందిన గౌరిశెట్టి నాగభూషణం, భారతమ్మ దంపతులు, కుమారుల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కల్యాణ వేడుకలో మహిళల కోలాటం ఆకట్టుకుంది.

పోటీలు మేధాశక్తిని పెంపొందిస్తాయి


బహుమతి అందజేస్తున్న కలెక్టర్

కొత్తగూడెంఅర్బన్: ఇస్కాన్ హరే కృష్ణ హరే రామ జూహు బొంబాయి వారి ఆధ్వర్యంలో కొత్తగూడెం శాఖ పర్యవేక్షణలో ఆదివారం కొత్తగూడెం సింగరేణి పాఠశాలలో జిల్లా స్థాయి, పాఠశాల స్థాయి భవద్గీత వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్ నిర్వహించారు. ఆర్కిడ్స్ పాఠశాల నుంచి జిల్లా స్థాయిలో తొమ్మిదో తరగతి చదువుతున్న వేద వ్రతుకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రథమ బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భగద్గీత పోటీలు పిల్లల మేధాశక్తిని, సృజనాత్మకతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కిడ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, కరస్పాండెంట్, డైరెక్టర్ సాగర్, గైడ్ టీచర్ హరిత, రాధిక, రూప బండారి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో రిజర్వేషన్లు అమలు చేయాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 12 నుంచి జరగనున్న తెలంగాణ రాష్ట్ర వేసవి అసెంబ్లీ సమావేశాల్లో ఏజెన్సీ ప్రాంతం ఎస్సీ కులాల అభివృద్ధిపై ప్రస్తావించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రస్తావించాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, వార్డు సభ్యులకు రిజర్వేషన్ అమలు చేయాలని, ఎస్సీ రైతుల సాగు భూములకు, పోడు భూములకు ఆంక్షలు లేకుండా హక్కు పత్రాలు ఇవ్వాలని, స్థానిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతం ఎస్సీ కులాలను ఎస్సీ కులాలుగా గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. ఈనెల 17, 18 తేదీలలో రిలే నిరాహార దీక్షలు జరగనున్నాయని, ఎస్సీ కులాల ధర్మ పోరాట దీక్షను ఎస్సీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కొమ్ము శ్రీరామ్, పరంజ్యోతి, నడ్డి రవికుమార్, చదలవాడ సూరి, మోదుగ జోగారావు పాల్గొన్నారు.

యూడీఐడీకి దరఖాస్తు చేసుకోండి..

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగులకు ఉద్యోగ ఉపాధి, విద్య, పెన్షన్లు పొందేందుకు దేశవ్యాప్తంగా రూపొందించిన యూనిక్ డిజేబులిటీ ఐడెంటిటీ కార్డు, (యూడీఐడీ) పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్డు దేశవ్యాప్తంగా ఉపయోగపడుతుందని, మార్చి 2025 నుంచి 21 రకాల అంగవైకల్యాలకు సంబంధించి యూడీఐడీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయ కమిటీలో అవకాశం ఇవ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

పాల్వంచ: పెద్దమ్మగుడి పాలక మండలి కమిటీలో స్థానికంగా ఉండే జగన్నాథపురం, కేశవాపురం గ్రామస్తులకు అవకాశం కల్పించాలని పలువురు నాయకులు కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక గ్రామాల వారిని కాదని, పార్టీకి గానీ, సేవా కార్యక్రమాలకు గానీ సంబంధం లేని వ్యక్తులను నియమించినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇది సరైంది కాదన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, ఎన్నికల సమయంలో లేని వ్యక్తులు ఇప్పుడు అధికారంలోకి రాగానే వచ్చిన వారికి ఇవ్వరాదని మంత్రులకు, స్థానిక ఎమ్మెల్యేను కోరుతున్నట్లు చెప్పారు. గంధం నరసింహారావు, అజ్మీరా రమేష్‌నాయక్, రాము, నరేష్, ఉదయ్‌కుమార్, నగేష్, శేఖర్, వెంకళరావు, రాకేష్, మహేష్, సతీష్, అరవింద్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఫిజియోథెరపీ సేవలు


ఫిజియోథెరపీ పరికరాలు


ఫిజియోథెరపీ చేస్తున్న విజయ

- ఫిబ్రవరిలో 196 మందికి...
- రెండు బెడ్ల ద్వారా రోజుకు 15 మందికి సేవలు
- పేదలకు తప్పిన ఖర్చు

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో ఒక్కో సేవను విస్తరిస్తున్నారు. తాజాగా ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పోయిన ఫిబ్రవరిలో 196 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఇల్లెందు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయిన తర్వాత అవసరాన్ని బట్టి ఒక్కో సేవను కొత్తగా అందుబాటులోకి తెస్తున్నారు. తాజాగా రూ.2.75 లక్షలతో ఫిజియోథెరపీ యూనిట్ మంజూరు కాగా గత జనవరిలో బ్లడ్ బ్యాంక్ గదిని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. స్థానిక ఫిజియోథెరపిస్ట్ విజయ సకాలంలో ఫిజియోథెరపీ చేసి పంపుతుండటంతో పేదలకు ఖర్చు తగ్గింది. ప్రతీనెల రూ.వేలకు వేలు చెల్లించి బయట సేవలు పొందే పేదలు ఇక మీదట ఇల్లెందు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఈ సేవలు అందుబాటులోకి రావటంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థోపెడిక్ డాక్టర్ పరీక్షించిన తర్వాత రికమండ్ చేసిన రోగులకు ఇక్కడ ఫిజియోథెరపీ చేసే అవకాశం ఉంటుంది.

స్థానికంగా ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి వచ్చాయి..



ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఏ రోగి అయినా తన వద్దకు వస్తే పరీక్షించి అవసరమైతే రికమండ్ చేస్తాను. ఆపరేషన్ అయిన రోగులకు ఆ అవయవం మొద్దుబారిపోయే ప్రమాదం ఉంటుంది. అలాంటి వారికి ఫిజియోథెరపీ అవసరం అవుతుంది. కీళ్లు, కాళ్లు, చేతులు ఇతర భాగాల్లో నొప్పులు విపరీతంగా ఉంటే వారికి కూడా ఫిజియోథెరపీ రికమండ్ చేస్తాం.

– డాక్టర్ జి.హర్షవర్ధన్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, ఇల్లెందు